క్లుప్తంగా

ట్యాలీ కోర్సులో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో ట్యాలీ కోర్సులో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి ఉండాలని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 26 ఏళ్ల లోపు ఉండాలని, 35 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ట్యాలీతోపాటు కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో కూడా శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో పులివెందుల అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ కార్మిక విభాగం నూతన కమిటీని నియమించి నియమాక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా నిఖిల్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పుల్లయ్య, వెంగల్‌రెడ్డితో పాటు మరికొంతమందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.

నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు

పెండ్లిమర్రి : పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు శిక్షణతో నిమిత్తం లేకుండా ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాల కోసం సోమవారం పెండ్లిమర్రి వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలని ఆయన తెలిపారు.

26,27 తేదీల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి

– సమగ్రశిక్ష సీఎంఓ కేశవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 26,27 తేదీల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి మిట్టా కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే వివిధ విద్యా కార్యక్రమాలను ఈ సమావేశంలో పేరెంట్ కమిటీలకు వివరించాలని తెలిపారు. పిల్లలను ప్రతి రోజు పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా కానుకను ఎలా ఉపయోగించాలో తెలియపరచాలని తెలిపారు. విదార్థులు పాఠశాలకు డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని తెలిపారు.


మసీదు కమిటీకి రూ.50వేలు విరాళం



జన్నతుల్ బకీ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న సుభాన్‌బాషా

కడప కార్పొరేషన్: చెన్నూరులోని అంజుమన్ జన్నతుల్ బకీ బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ మసీదు కమిటీకి వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సుభాన్ బాషా రూ.50వేల విరాళం అందజేశారు. ఆదివారం నాగరాజుపేటలోని తన కార్యాలయంలో మసీదు కమిటీ సభ్యులకు ఇందుకు సంబంధించిన నగదును అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ తన మాతృమూర్తి రెండో వర్ధంతి సందర్భంగా ఈ మంచి కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వికాస్ విద్యాసంస్థ ప్రిన్సిపల్ సుల్తాన్ బాబా, 33వ డివిజన్ ఇన్‌చార్జి చాక్లెట్ గౌస్, మసీదు కమిటీ సభ్యులు షబ్బీర్, అన్వర్, జుమ్మాన్, ఉస్మాన్‌ఖాన్, మన్సూర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షల్లో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప నాగరాజుపేటలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ మహబూబ్‌అలీ నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది రోగులు పాల్గొని షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలను చేయించుకున్నారని అవసరం ఉన్న వారికి మందులను ఉచితంగా అందచేశామని డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా షుగర్ పేషెంట్లు సక్రమంగా మందులను వాడుతూ ఆహార నియంత్రణతోపాటు వ్యాయామాలు చేయాలన్నారు. శిబిరంలో మెడికల్ రెప్స్, హాస్పిటల్ సిబ్బంది సుబ్బరాయుడు, నూర్, గౌతమి, ఆయేషా, యాస్మిన్ పాల్గొన్నారు.

జానపదానికి వన్నె తెచ్చిన 'అమళ్లదిన్నె'



వక్త కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం నిర్వాహకులు

కడప కల్చరల్ : జానపద, సంగీత విభాగాలలో తనదైన ముద్ర వేసి ఆ కళకు వన్నె తెచ్చిన అరుదైన కళాకారుడు అమళ్లదిన్నె గోపీనాథ్ అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళలశాఖ విశ్రాంత ఆచార్యులు చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 121వ సాహిత్య సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి సభలో 'అమళ్లదిన్నె గోపీనాథ్ జీవితం–సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. అమళ్లదిన్నె గోపీనాథ్ ఆలపించిన, సేకరించిన సీమ ప్రాంతానికి చెందిన ఎన్నో జానపద గేయాలు నేటికీ జనపథాలలో నిలిచి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్ జీవన ప్రస్థానాన్ని వివరించారు. ఆయన ఉత్తమ స్థాయి జానపద కళాకారుడని, వక్త అని, ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా తన జానపద గేయాలకు విశేష ప్రాచుర్యం కల్పించారన్నారు. అనంతపురం జానపద కళాపరిషత్ అధ్యక్షుడిగా, లలిత కళాపరిషత్ సంయుక్త కార్యదర్శిగా కూడా సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఆచార్య రమాదేవి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రమణ్యం తదితరులు వక్త కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, జానపద కళాకారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ రక్షణే బాధ్యతగా భావిద్దాం

డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య



మాట్లాడుతున్న వల్లూరు బ్రహ్మయ్య

కడప కల్చరల్ : కడప నగరం నడిబొడ్డున గల పాత కలెక్టరేట్‌కు మించిన వారసత్వ సంపద జిల్లాలో మరొకటి లేదని, దాన్ని రక్షించుకుని మరో వందేళ్లు ఉండేలా భావితరాలకు కానుకగా అందివ్వాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం పాత కలెక్టరేట్‌లోని భారత జాతీయ కళావారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కార్యాలయంలో జిల్లాలోని వారసత్వ ప్రదేశాల గుర్తింపుపై సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌ను ఆధునీకరిస్తే ఆదాయంతోపాటు అద్భుతమైన వారసత్వ సంపదను దక్కించుకున్న వారమవుతామన్నారు. ఇంటాక్ కార్యాలయంలో ఇప్పుడున్న గ్రంథాలయంతోపాటు గ్రామీణ వ్యవసాయ పనిముట్లను సేకరించి గ్రామీణ మ్యూజియంను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. సంస్థ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో గొప్ప జానపద కళాకారుల పాటల రికార్డుతో పాటు, సంస్థ పక్షాన మొన్నటితరం జిల్లా ప్రముఖుల చేతి వ్రాతను సేకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యాటకశాఖ పూర్వ అధికారి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వారసత్వ ప్రాంతాలు, వాటి ప్రశస్తి గురించి వివరించారు. ఈ సందర్భంగా కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో యువ జానపద గాయని సరళను సత్కరించారు. పద్మప్రియ చంద్రారెడ్డి తన శిష్యబృందంతో రూపొందించిన జిల్లా పర్యాటక ప్రాంతాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆకాశవాణి కళాకారులు గౌరీశంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, లయన్‌గౌరీశంకర్, పూర్వ అధ్యక్షులు జోజిరెడ్డి, సంజీవరెడ్డి, మాకం నాగరాజ, భారవి, రేడియో గంగాధర్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు కల్చరల్ : మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని కడప సైనిక సంక్షేమ కార్యాలయం అధికారి ఐజే రఘురామయ్య తెలిపారు. ఆదివారం ఎన్జీఓ హోంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎన్.బాలవీరారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు తమ సమస్యలను తెలపాలన్నారు. మాజీ సైనికులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన ప్రయోజనాలు ఏవైనా పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వానికి తెలిపి పరిష్కరిస్తామన్నారు. 80 ఏళ్లు పైబడిన మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, ఎర్రగుంట్ల, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

వీరపునాయునిపల్లె: మండలంలోని కొమ్మద్ది సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీజు వివరాలు నోటీసు బోర్డులో ఉండేలా చూడాలి



మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పట్టిక వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందుల, మైదుకూరు ప్రాంతాలలో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఫీజుల రూపంలో వేలకు వేలు దండుకుంటున్నాయన్నారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు 25 వేలు మొదలుకుని లక్షా 20 వేల వరకు ఫీజులను రాబడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజుల పట్టిక వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని ఉన్నా ఎవరూ అమలు చేయడం లేదన్నారు. పీడీఎస్‌యూ నాయకులు శ్రీనివాసులరెడ్డి, దేవేంద్ర, అశోక్‌బాబు, బాలు, గంగాధర్, మోహన్, ఖాజావలి పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి

– ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా బదిలీ పొందిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సప్పరపు రామాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడపలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా పదోన్నతి వచ్చినందున బదిలీ అయిన చాలామంది ఉపాధ్యాయులకు ఎల్‌పీసీ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా నాయకులు సలాం, శ్రీరాములు, సాగర్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో చదువులబాబు కృషి ప్రశంసనీయం



చదువుల బాబును సత్కరిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : బాల సాహిత్యంలో డీకే చదువుల బాబు ఎనలేని సేవ చేశారని.. ఆయన కృషి ప్రశంసనీయమని కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం కేంద్రసాహిత్య అకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువులబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ చదువులబాబు నాలుగు దశాబ్దాలుగా బాలసాహిత్యంలో విశిష్ట సేవలందిస్తూ 700పైగా బాలల కథలు రచించారన్నారు. వేలాది మంది విద్యార్థుల హృదయాల్లో నైతిక విలువలను పెంపొందించడానికి, భావిభారత పౌరులుగా ఎదగడానికి తన కథల ద్వారా బీజం వేశారన్నారు. బాలల కథలే కాకుండా సమాజాన్ని సంస్కరించే కథలు రచించి సిరిపురి కీర్తిని ఢిల్లీ పీఠంపై ఆవిష్కరించారన్నారు. డాక్టర్ మూలె రామమునిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభుకుమార్ మాట్లాడుతూ పండితుడుగా, సాహితీ ప్రియుడుగా చదువులబాబు చేస్తున్న సేవను కొనియాడారు. చదువులబాబును శాలువ కప్పి, పూలమాల వేసి సత్కరించారు. రచయిత ఖలందర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సాహితీ అభిమానులు, కొనిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న పవన్ దత్త

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామిని ఆదివారం సివిల్స్‌లో జాతీయస్థాయిలో 22వ ర్యాంకు సాధించిన పవన్ దత్త కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు పవన్ దత్తను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త నరసింహ హరిప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

పుష్పగిరి గిరి ప్రదక్షిణకు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమి నాడు పుష్పగిరిలో జరిగే గిరి ప్రదక్షిణకు హాజరు కావాలని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌ను కోరారు. ఈ మేరకు జగన్మాత మారెమ్మ దేవాలయం ధర్మకర్త, న్యాయవాది భారవి ఆదివారం నగరానికివచ్చిన సత్యకుమార్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణయాదవ్, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సేన ముఖ్య సభ్యులు సత్యనారాయణ గాంధీ, సునీల్, భాస్కర్, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియుల ఉన్నతికి కృషి చేద్దాం



విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న తొగట వీర క్షత్రియ సేవా సంఘం నాయకులు

కడప కల్చరల్ : తొగట వీర క్షత్రియుల ఉన్నతికి సంఘ ప్రతినిధులంతా కృషి చేయాలని ఆ సంఘం నగర శాఖ అధ్యక్షులు కల్యా సుధాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియుల విద్యార్థులకు సంఘం ప్రముఖులు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదుతోపాటు జ్ఞాపికలు అందజేశారు. అలాగే ప్రతిభ చూపిన 78 మంది విద్యార్థులకు రూ. 2000 చొప్పున నగదు, తదితరాలు అందజేశారు. నగర పరిధిలోగల ప్రైవేటు పాఠశాలల్లో చదివి అధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణ సుధాకర్ మాట్లాడుతూ 14 ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు అభ్యసించాలని, విద్యలో రాణించినపుడే నలుగురికి మేలు జరుగుతుందన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు మాట్లాడుతూ ఉన్నత విద్యతో మాత్రమే ఉత్తమ జీవితం లభిస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడారు. తొగట వీర క్షత్రియ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విలువలతోకూడిన విద్య ద్వారా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిమ్మని సూర్యారావు, సంఘం జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు మోతుకూరు సుబ్బరాయుడు, సీఆర్‌ఐ ఛారిటబుల్‌ట్రస్టు వ్యవస్థాపకులు సీఆర్‌ఐ సునీల్ జయంత్ కూడా మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు, ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కాక అనంతపురం, కర్నూల్ జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి



కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం కడప శంకరాపురం సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు రవాణా అధికారుల నిబంధనలను పెడచెవిన పెట్టి ఇష్టానుసారంగా కండిషన్ లేని బస్సులు నడుపుతున్నారన్నారు. అదే విధంగా సీట్ల పరిమితికి మంచి విద్యార్థులను ఎక్కించి పాఠశాలలకు తరలిస్తున్నారన్నారు. ఈ విషయంలో రవాణాశాఖ అధికారులు స్పందించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కరి మబ్బులు కదిలి.. చిరు జల్లులై కురిసి



నైరుతి రుతుపవనాల రాకతో జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై కనిపిస్తోంది. నల్లగా కమ్ముతూ... ఆపై గాలులకు తేలిపోతూ మబ్బులు దోబూచులాడుతున్నాయి. దీంతో వాతావరణం కొంత చల్లబడింది. ఆదివారం ఉదయం నుంచి ఆకాశంలో ఇలా నిండుగా మబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రానికి చిరుజల్లులుగా రాలాయి. వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగింది. –కడప ఎడ్యుకేషన్

విద్యా, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: విద్య, ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా కోరారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 117 అమలుతో ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగ నిర్వీర్యం అయ్యిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 3,4 తరగతులను విలీనం చేయడం వల్ల ఉపాధ్యాయులకు బోధనకు, విద్యార్థుల సామర్థ్యాల మధ్య అంతరం ఏర్పడి సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగిస్తూనే 6 తరగతి నుంచి 10వ తరగతి ప్లస్ టు ఒకే చోట నిర్వహిస్తే విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతారని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. విద్యారంగంలో పనిచేస్తున్న పీఆర్‌సీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, కేజీబీవీల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, ఏజాస్ అహ్మద్, చెన్నయ్య, సివిరమణ, పర్వీన్, అకడమిక్ కన్వీనర్ నరసింహారావు, సుదర్శన్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



జెండా వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి బ్లాక్ పోరాటం చేస్తోందని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. నేటికి 72 ఏళ్లు పూర్తి చేసుకుని 73వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం కడపలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలను చేశారు. అనంతరం జయవర్ధన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీనూతన జాతీయ విద్యావిధానం పేరుతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు నరసింహ, దేవేంద్ర, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ గురువులకు సత్కారం



క్రైస్తవ గురువులను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఇద్దరు క్రైస్తవ గురువులను స్థానిక శాంతి సేవాసొసైటీ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మడగలం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పాదర్ ఎండీ ప్రసాద్‌రావు, సహాయ డైరెక్టర్ పాదర్ విల్సన్‌లను సంస్థ ప్రతినిధులను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ జిల్లాలో సుప్రసిద్ధ క్రైస్తవ పుణ్యక్షేత్రం, వేలాంగిణి మాతగా పేరుగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం మరియతల్లి దీవెనలతో దినదినాభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. బాలలకు సత్యోపదేశంతో కూడిన సండే తరగతులు ఏర్పాటు చేయాలని, యవ్వనస్తులకు సువార్త పరిచర్యలో ప్రాతినిధ్యం కల్పించాలని, సేవా మార్గం వైపు నడిపిస్తూ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు సామాజిక సేవలు అందించేందుకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎలిజిబెత్, సభ్యులు ఆనంద్, స్రవంతి, అమృత తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ముద్ర డ్యాన్స్ అకాడమి మాస్టర్ విజయశాంతి ఆధ్వర్యంలో చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ధార్మిక సేవల దిశగా చెన్నూరు

చెన్నూరు : స్వార్థ ప్రయోజనాలే ధ్యేయంగా సాగుతున్న సమాజంలో ధార్మిక సేవల దిశగా చెన్నూరులో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. మానవసేవే మాధవ సేవ లక్ష్యంగా చేసుకుని చెన్నూరుకు చెందిన కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను ఆధ్యాత్మిక సేవలు వైపు నడిపిస్తున్నారు. ఇందుకుగాను మానవతా సేవా సంస్థ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ సంస్థ నూతన అధ్యక్షుడిగా జి.ఎస్.భాస్కర్ రెడ్డిని గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తనకు ఈ పదవి ఇచ్చిన గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ శాశ్వత అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, డైరెక్టర్స్ కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి చంద్రమౌళి , ఆరవేటి శ్రీనివాసరాజు, ఆవుల బసిరెడ్డి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి తెలిపారు. ఆరోగ్యభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నిరాశ్రయుల వసతి గృహంలో మంచి ఆరోగ్యం–తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం, క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని వివరించారు. పరిశుభ్రత అనేది ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, వ్యాధుల వ్యాప్తిని నిరోధించడానికి సహాయపడేదనే విషయాన్ని ప్రతిఒక్కరు గ్రహించాలని సూచించారు. అనంతరం పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.రహీమ్, సంస్థ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.